క్లుప్తంగా

నేడు వైఎస్సార్‌సీపీ భారీ ర్యాలీ

అనంతగిరి: అరకు ఎంపీగా తనూజరాణిని ప్రకటించడంపై మండలంలోని చిలకలగెడ్డ నుంచి అరకు వరకు వైఎస్సార్‌సీపీ శ్రేణులతో బుధవారం భారీగా ర్యాలీ చేపడుతున్నామని మండల పార్టీ అధ్యక్షుడు రేగబోయిన స్వామి తెలిపారు. ఉదయం చిలకలగెడ్డ వద్దకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలి వచ్చి, ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. ర్యాలీలోని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, పార్టీ పరిశీలకురాలు శోభ హైమావతి, జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, అరకు ఎంపీ అభ్యర్థి గుమ్మ తనూజరాణి, అరకు ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగం, తదితరులు పాల్గొంటున్నారని తెలిపారు.

భీమలింగేశ్వర స్వామి జాతర నేడు

పెదబయలు: మండలంలోని సీతగుంట భీమలింగేశ్వర స్వామి ఆలయంలో పాల్గుణ మాసం శుక్ల ఏకాదశి సందర్భంగా బుధవారం జాతర నిర్వహిస్తున్నట్టు ఉత్సవ కమిటీ అధ్యక్షులు రూడ లక్ష్మణరావు తెలిపారు. తెల్లవారు జాము నుంచి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, గోత్ర నామాలతో పూజలు జరుగుతాయని పేర్కొన్నారు. ఆలయ ప్రాంగణంలో రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఆంధ్రతో పాటు సరిహద్దు ఒడిశా రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి ఉత్సవాన్ని విజయవంతం చేయాలని కమిటీ సభ్యులు, సీతగుంట గ్రామ పెద్దలు కోరారు.

ఎంసెట్‌కు ఉచిత శిక్షణ

రంపచోడవరం: ఇంటర్ ఎంపీసీ పూర్తి చేసిన విద్యార్థులకు రంపచోడవరం లెనోరా ఇంజినీరింగ్ కళాశాలలో ఉచితంగా ఎంసెట్ కోచింగ్ ఇవ్వనున్నట్టు లెనోరా విద్యా సంస్థ అధినేత డాక్టర్ బి.జాన్‌రత్నం చెప్పారు.ఉచిత శిక్షణతో పాటు వసతి, భోజన సదుపాయం కల్పించినట్టు తెలిపారు. ఎంసెట్ దరఖాస్తును ఉచితంగా అందజేస్తామన్నారు. బుధవారం నుంచి శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. పేద విద్యార్థులకు ఉచితంగా విద్యను అందించడమే తమ సంస్థ లక్ష్యమన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 94942111112, 9490797594 నంబర్లకు సంప్రదించాలని తెలిపారు. పదో తరగతి పరీక్షలు పూర్తయిన తరువాత పాలీసెట్ (పాలిటెక్నిక్ ఎంట్రన్స్)కూడా ఉచిత శిక్షణ ఇస్తామన్నారు.

ఓటు హక్కుపై అవగాహన



యువతకు వాలీబాల్ కిట్ అందజేస్తున్న ఎస్‌ఐ శివకుమార్

మోతుగూడెం: అల్లూరి జిల్లా ఎస్పీ తూహిన్ సిన్హా, రంపచోడవరం ఓఎస్డీ కేవీ మహేశ్వర రెడ్డి , చింతూరు అడిషనల్ ఎస్పీ రాహుల్ మీనా, చింతూరు సీఐ గజేంద్ర కుమార్ ఆదేశాలతో బొడ్డగండి గ్రామంలో డొంకరాయి ఎస్‌ఐ శివ కుమార్ మంగళవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ప్రతీ ఒక్కరూ తమ ఓటు హక్కును పూర్తి స్వేచ్ఛతో వినియోగించుకోవాలన్నారు. ఎన్నికల కోడ్ నిబంధనను అందరూ పాటించాలని సూచించారు. యువతకు వాలీబాల్ కిట్, చిన్నారులకు స్వీట్లు పంపిణీ చేశారు.హెడ్ కానిస్టేబుల్ కళ్యాణ్, కానిస్టేబుల్ పాసయ్య తదితరులున్నారు.

ఘనంగా దొంతులమ్మ తల్లి ఉత్సవాలు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

చింతపల్లిరూరల్: తాజంగిలో దొంతులమ్మ తల్లి తీర్థమహోత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు..తాజంగి కొండపై కొలువున్న దొంతులమ్మ తల్లి తాజంగి గ్రామస్తులు గ్రామ దేవతగా కొలుస్తున్నారు. గ్రామస్తులు ఈ తీర్థ మహోత్సవాలను నిర్వహిస్తున్నారు.మూడు రోజులు జరిగే ఈ జాతరలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకుంటారు.జాతర సందర్భంగా పలు సంస్కృతిక కార్యక్రమాలను గ్రామస్తులు ఏర్పాటు చేశారు.

ప్రగతి పథంలో మాడగడ





బెంజిపూర్‌లో నిర్మాణంలో ఉన్న వాటర్ ట్యాంక్



మాడగడ పీహెచ్‌సీ



పీహెచ్‌సీ లోపల ఓపీ గది

అరకులోయ రూరల్: ఏజెన్సీలో దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోని చాటా గ్రామాలు నేడు ప్రగతి పథంలో పరుగులు తీస్తున్నాయి.ఇందులో భాగంగా మాడగడ మేజర్ పంచాయతీలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో విస్తృతంగా అభివృద్ధి జరిగింది. మండలంలోని రూ.5.90లక్షలతో వివిధ అభివృద్ధి పనులు జరిగాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పంచాయతీ పరిధిలో ఎటువంటి అభివృద్ధి జాడ కనిపించలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామాల్లో అభివృద్ధితో పాటు ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. మాడగడలోని గొడగెడ్డ కల్వర్టు నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయి. సుమారు 3.60లక్షలతో మాడగడ గొడగెడ్డ కల్వర్టు పనులు చేపట్టారు. దీంతో 30 గ్రామాలకు రవాణా సౌకర్యం మెరుగుపడిందని స్థానికులు చెబుతున్నారు.



పక్కనగుడలో సీసీరోడ్డు

సుంకరమెట్ట, కొత్తభల్లుగుడ, కినంగూడ, చంపగుడ గ్రామాలకు రింగురోడ్డు సౌకర్యం కలిగింది, మాడగడ పీహెచ్‌సీలో రూ.35లక్షలతో ఆధునికీకరణ పనులు చేపట్టారు. రోగులకు అన్నివేళల్లో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండి సేవలందిస్తున్నారు. అన్ని రకాల వైద్య పరీక్షలు చేస్తున్నారు. ఆస్పత్రి అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించారు. మాడగడ గ్రామ సచివాలయాల పరిధిలో 1094 మంది రైతులు రైతు భరోసా పథకం లబ్ధి పొందుతున్నారు. జగనన్న శాశ్వత భూ హక్కు పథకం ద్వారా 428 మంది రైతులకు పట్టాలు అందజేశారు. 400 మంది కొండపోడు రైతులకు ప్రభుత్వం ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాలను అందజేసింది.

నాడు–నేడుతో అభివృద్ధి జరిగిన పాఠశాలలు

హట్టగుడ పాఠశాలలో రూ.12లక్షలు, నందిగుడ స్కూల్‌లో రూ.12లక్షలు, చంపగుడ, గంగుడి, కుసుమగుడ గ్రామాల్లోని ఒక్కో ప్రాథమిక పాఠశాలకు రూ.12లక్షల చొప్పున ప్రభుత్వం విడుదల చేసిన నిధులతో అభివృద్ధి పనులు జరిగాయి.

గ్రామాల్లో తాగునీటి పథకాలు

బెంజిపూర్‌లో రూ.20లక్షలతో తాగునీటి ట్యాంకు పనులు చివరి దశకు చేరుకున్నాయి. బోసుబెడ్డ, డింగ్రిపుట్టు గ్రామాల్లో తాగునీటి పథకాల కోసం ఒక్కో గ్రామానికి రూ.9లక్షలు చొప్పున, దలపతిగూడకు రూ.6లక్షలు, చంపగుడకు రూ.7లక్షలతో తాగునీటి పథకాలు, ఇంటింటికీ కుళాయి పనులు జరుగుతున్నాయి.

గ్రామ సచివాలయం ,రైతు భరోసా కేంద్రాల నిర్మాణాలు

మాడగడ, మంజగుడలో ఒక్కో సచివాలయానికి రూ.43.60లక్షతో గ్రామ సచివాలయాలు, మాడగడలో రూ.23.94లక్షలతో రైతు భరోసా కేంద్రం పనులు చేపడుతున్నారు.

విద్యకు ప్రభుత్వం పెద్దపీట



ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేసింది. పేద విద్యార్థుల భాధ్యత సీఎం జగన్‌మోహన్ రెడ్డి తీసుకున్నారు, విద్యా ప్రమాణాల్లో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారు. ప్రభుత్వ బడుల్లో కార్పొరేట్ సదుపాయాలు దర్శనమిస్తున్నాయి.

– సుమన్, పాఠశాల కమిటీ చైర్మన్, మాడగడ పంచాయతీ

ఆనందంగా ఉంది



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందుతున్నాయి. గతంలో ఏనాడు జరగని అభివృద్ధి నేడు జరుగుతోంది. శివారు గ్రామాల్లోనూ పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పించింది.గొడగెడ్డపై కల్వర్టు పూర్తి చేశారు. రవాణా సౌకర్యం మెరుగుపడింది. ఆనందంగా ఉంది.

– స్వామి, రైతు మాడగడ పంచాయతీ

విద్యార్థులకు వైద్య పరీక్షలు



విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

పాడేరు: విద్యార్థులు పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని పాడేరు జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విశ్వమిత్ర స్పష్టం చేశారు. లెక్టర్, ఐటీడీఏ పీవో ఆదేశాల మేరకు మంగళవారం పట్టణంలోని కుమ్మరిపుట్టు గిరిజన సంక్షేమ బాలికల ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో విద్యార్థినులకు చర్మ వ్యాధులపై ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 350 మంది వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. జిల్లా ఆస్పత్రి సూపరిండెంట్ డాక్టర్ విశ్వమిత్ర మాట్లాడుతూ కలెక్టర్, ఐటీడీఏ ఆదేశాలతో ఇప్పటికే మూడు ఆశ్రమ పాఠశాలల్లో వైద్య శిబిరాలు నిర్వహించి సుమారు 1500 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశామన్నారు.అన్ని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు తమ ఆరోగ్యంపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. జిల్లా ఆస్పత్రి చర్మ వ్యాధుల నిపుణులు డాక్టర్ ఎర్రయ్య, డాక్టర్ హనీ, ఏటీడబ్ల్యూవో ఎల్. రజనీ, హెచ్ఎం గంగాభవానీ పాల్గొన్నా రు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



బర్రిమామిడిలోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ సత్య సులోచన

గంగవరం: మండలంలోని బర్రిమామిడి మండల పరిషత్ పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని తహసీల్దార్ సత్య సులోచన మంగళవారం సందర్శించారు. కేంద్రంలో సౌకర్యాలపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. మండల వ్యాప్తంగా 37 పోలింగ్ కేంద్రాలున్నాయని, అన్ని కేంద్రాలు సందర్శిస్తామన్నారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జిలానీ బాషా, వీఆర్వో వెంకన్నదొర తదితరులున్నారు.

రాజవొమ్మంగి: మండలంలోని 62 రెవెన్యూ గ్రామాల్లో 52 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేసినట్టు తహసీల్దార్ డి.వి.సత్యనారాయణ చెప్పారు. ఎన్నికల ప్రవర్తనా నియామళిని రాజకీయ నాయకులు తప్పనిసరిగా పాటించాలన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అందరూ సహకరించాలని కోరారు.

వర్తకులు బాధ్యతగా మెలగాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ రమేష్

ముంచంగిపుట్టు: వర్తకులు బాధ్యతగా మెలగితే దొంగతనాలను అరికట్టవచ్చని జి.మాడుగుల సీఐ ఎస్. రమేష్ అన్నారు. మండల కేంద్రంలో ఉన్న వర్తకులతో మంగళవారం సీఐ రమేష్ సమావేశం నిర్వహించారు. మండలంలో జరుగుతున్న దొంగతనాలపై వర్తకులకు వివరించి, అప్రమత్తంగా ఉండాల్సిన బాధ్యతపై అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి దుకాణదారుడు బాధ్యతగా షాప్ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, రాత్రిళ్లు షాపు బయట విద్యుత్ లైట్ వెలిగించే ఉంచాలన్నారు. వ్యాపారులు, ఇంటి యజమానులు దొంగతనాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని, ఏమాత్రం నిర్లక్ష్యంగా ఉన్న భారీ నష్టం తప్పదన్నారు. గ్రామాల్లో అపరిచిత వ్యక్తులకు ఆశ్రయం కల్పించవద్దని, అనుమానస్పదంగా ఎవరు కనిపించిన తమకు సమాచారం ఇవ్వాలని సీఐ రమేష్ కోరారు.

నేడు రాధాకృష్ణ ఆలయ వార్షికోత్సవం

అరకులోయటౌన్: మండలంలోని తాంగులగుడ, శరభగుడ ఉమ్మడి గ్రామాల రాధాకృష్ణ దేవాలయ వార్షికోత్సవాన్ని బుధవారం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు తాంగుల హరి, జలందర్, అప్పన్న, అర్జున్, తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం భారీ అన్నసమారాణ, రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు.

ఎన్నికల కోడ్‌ను పక్కాగా అమలుచేయాలి



వై.రామవరంలో సచివాలయ కార్యదర్శులకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో రవికిషోర్



జీకే వీధిలో రికార్డులు తనిఖీ చేస్తున్న ఎంపీడీవో ఉమామహేశ్వరరావు

గూడెంకొత్తవీధి: మండలంలోని సంకాడ, పెదవలస, లక్కవరపేట , దేవరాపల్లి సచివాలయాలను మంగళవారం ఎంపీడీవో ఉమామహేశ్వరరావు తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్‌ను పక్కాగా అమలుచేయాలని, దీన్ని ధిక్కరిస్తే శాఖాపరమైన చర్యలు తీవ్రంగా ఉంటాయన్నారు. రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు, బ్యానర్లు తొలగించాలని, విగ్రహాలకు ముసుగులు వేయాలన్నారు. ఎటువంటి సంఘటనలు జరిగినా తక్షణమే అధికారులకు సమాచారం ఇవ్వాలని ఆదేశించారు.

కూనవరం: మండలంలోని 20,179 ఓటర్లకుగాను 25 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేసినట్టు తహసీల్దార్, ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ఆర్.వి.మురళీకృష్ణ చెప్పారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో అన్ని మౌలిక వసతులు కల్పించామన్నారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉందని, అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏపీఎఓ శ్రీకాంత్, ట్రైబల్ వెల్ఫేర్ ఏఈ ప్రవీణ్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ భాను ప్రకాశ్, హౌసింగ్ ఏఈ నారాయణరావులు సెక్టోరల్ ఆఫీసరులుగా వ్యవహరిస్తారని చెప్పారు. సమస్యాత్మక గ్రామాలు ఐదారు గుర్తించామని, అక్కడ అదనపు పోలీసు బలగాల ఏర్పాటుకు ఉన్నతాధికారులకు నివేదించామన్నారు.

వై.రామవరం: మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయాల కార్యదర్శులతో ఎంపీడీవో రవికిషోర్ మంగళవారం సమావేశం నిర్వహించారు. ఎన్నికల కోడ్ పక్కాగా అమలు అయ్యేలా చూడాలన్నారు. ప్రశాంతంగా ఎన్నికల ప్రక్రియ ముగించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. సచివాలయ కార్యదర్శులు మధుసూధనరాజు, భార్గవరామ్‌చరణ్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు, అధికారుల చొరవతో రేషన్ పంపిణీ



సప్పర్లలో గిరిజనులకు రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్న సీఐ అశోక్‌కుమార్

గూడెంకొత్తవీధి: సిగ్నల్ సాంకేతిక సమస్యతో మండలంలోని మారుమూల పంచాయతీలైన అమ్మవారి దారకొండ, గాలికొండ పంచాయతీల్లోని గిరిజనులకు రేషన్ అందడం లేదు. ఈవిషయంపై గిరిజనులు గూడెంకొత్తవీధి పోలీసులకు విన్నవించారు. దీనిపై సీఐలు, అశోక్‌కుమార్, అప్పలనాయుడు, ఎస్‌ఐ అప్పలసూరిలు రెవెన్యూ అధికారులతో చర్చించారు. సిగ్నల్స్ లేని కారణంగా ఆయా పంచాయతీల్లో ఆఫ్‌లైన్ ద్వారా రేషన్ పంపిణీ చేపట్టాలని వారు అధికారులను కోరగా ఇందుకు రెవెన్యూ అధికారులు అనుమతులు ఇచ్చారు. దీంతో మంగళవారం సప్పర్ల కేంద్రంగా అమ్మవారి దారకొండ, గాలికొండ పంచాయతీలోని రేషన్ అందని లబ్ధిదారులందరినీ రప్పించి వారికి రేషన్ పంపిణీ చేపట్టారు. సీఐ అశోక్‌కుమార్, డిప్యూటీ తహసీల్దారు కుమారస్వామి పర్యవేక్షించారు. ఎస్‌ఐ అప్పలసూరి పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్ష కేంద్రాల్లో తనిఖీలు



కూనవరంలోని పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు

అరకులోయటౌన్: మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల, కంఠభౌంసుగుడ, కొత్తభల్లుగుడ, పీటీజీ బాలుర పాఠశా పరీక్ష కేంద్రాలను అధికారులు వినయ్‌మోహన్ , సీహెచ్.బాబూరావు రెండు స్క్వాడ్ బృందాలు బుధవారం తనిఖీలు చేవారు. ఎంఈవో మోహన్‌రావు తదితరులున్నారు.

కూనవరం: కూనవరం, నర్సింగపేటలోని పదో తరగతి పరీక్ష కేంద్రాల్లో రెండు రోజు 368 మందికి గాను 362 మంది విద్యార్థులు హాజరైనట్టు చీఫ్ సూపరింటెండెంట్లు చంద్రయ్య, పి.సత్యనారాయణ చెప్పారు.

రాజవొమ్మంగి: మండలంలోని నాలుగు కేంద్రాల్లో మంగళవారం రెండో రోజు జరిగిన పదో తరగతి హిందీ పరీక్షకు 445 మందికి గాను 438 మంది విద్యార్థులు పరీక్ష రాసినట్టు ఎంఈవో–2 సూరయ్యరెడ్డి చెప్పారు. పరీక్ష కేంద్రాలను ఇన్‌చార్జి ఎంఈవో–2 రాంబాబు పరిశీలించారు.

అనారోగ్యంతో కాంట్రాక్ట్ కార్మికుడి మృతి

సీలేరు: సీలేరు గ్రామానికి చెందిన పి.సురేంద్ర జెన్‌కోలో కాంట్రాక్ట్ కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్నారు.ఏడాదిగా అనారోగ్యానికి గురై విశాఖలో చికిత్స పొందుతున్నారు. మంగళవారం మధ్యాహ్నం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్టు కుటుంబసభ్యులు తెలిపారు. సురేంద్ర మృతికి సహచర సిబ్బంది, గ్రామస్తులు తదితరులు సంతాపం తెలిపారు.

సంక్షేమ పాలనకే ఓటు వేయండి



గిరిజనులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ పాడేరు ఎమ్మెల్యే అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజు



కృష్ణారావుకు వైఎస్సార్‌సీపీ కండువా వేసి సాదరంగా ఆహ్వానిస్తున్న నాయకులు



పీకే గూడెంలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పాడేరు : రాష్ట్రంలో సంక్షేమ రాజ్యం తెచ్చిన జగనన్న పాలనకే గిరిజనులు మద్దతు తెలిపి ఫ్యాన్ గుర్తుపై ఓటేసి మరోసారి గెలిపించాలని వైఎస్సార్‌సీపీ పాడేరు అసెంబ్లీ ఎమ్మెల్యే అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వర రాజు స్పష్టం చేశారు. మండలంలోని ఇరడాపల్లి పంచాయతీ మారుమూల బొడ్డాపుట్టు, సరియాపల్లి, ఈ.కొత్తూరు గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ శ్రేణులతో కలిసి మంగళవారం విస్తృతంగా పర్యటించారు. గ్రామస్తులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. మహిళలు హారతులు పట్టి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను గడపగడపకు వెళ్లి గిరిజనులకు వివరించారు. సంక్షేమ పథకాలు ఎంతో పారదర్శకంగా గడప వద్దకే అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. సంక్షేమ పథకాలు మరింతగా ముందుగా సాగాలన్నా అభివృద్ధి పరుగులు పెట్టాలన్నా మరోసారి రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీను అధికారంలోకి తేవాలన్నారు. ప్రతి ఒక్కరు ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లను కూడా వేయాలని అభ్యర్థించారు. మండల పార్టీ అధ్యక్షుడు సీదరి మంగన్నదొర, వైస్ ఎంపీపీ కుంతూరు కనకాలమ్మ, సర్పంచ్‌లు గుల్లెలి అశ్విజ, వంతాల రాంబాబు, గబ్బాడ చిట్టిబాబు, ఎంపీటీసీ సభ్యురాలు ముదిలి సుబ్బమ్మ, సల్లా చిట్టమ్మ, కె.నర్సింహమూర్తి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూతంగి సూరిబాబు, పీఏసీఎస్ చైర్మన్ లకే రామసత్యవతి, రాష్ట్ర ఎస్టీ సెల్ సంయుక్త కార్యదర్శులు కూడా సురేష్‌కుమార్, కిల్లు కోటిబాబు నాయుడు, ఎస్టీ సెల్ జోనల్ ఇన్‌చార్జి కిముడు విశ్వ, గ్రామ సచివాలయ కన్వీనర్లు ఈశ్వరరావు, నరేష్, సుశీల, నాయకులు నారాయణ, సత్తిబాబు, రత్నబాయి, లింగమూర్తి, సత్యనారాయణ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

హుకుంపేట: పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రజలకు ఆదుకుంటున్న సీఎం జగనన్నకు మళ్లీ గెలిపించుకునే భాధ్యత మన అందరిది అని మండల అధ్యక్షుడు గెమ్మెలి కొండబాబు, జేసీయస్ మండల ఇన్‌చార్జి కిల్లో రామకృష్ణ అన్నారు. మండలంలోని సంతారి పంచాయతీ పత్రిమెట్ట, బిలాయిపుట్టు, చిన బూరుగుపుట్టు, పెదబూరుగుపుట్టు, లొచలిపుట్టు, జలిగలబంద, కూతంగి, తాడిపుట్టు, రీడేబంద, ములుసోభ, బారపల్లి, కులుపాడు, సంపంగిపుట్టు, శోభకోట, సుంద్రుపుట్టు గ్రామాల్లో మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం కార్యక్రమం నిర్వహించారు. నాయకులు కార్యకర్తలు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎస్.కొండలరావు, సర్పంచ్ అప్పలనాయుడు, నాయకులు ధర్మయ్యదొర, సదాశివరాజు, చిన్నబ్బి, మహేష్, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన బీజేపీ నాయకుడు

వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు గెమ్మెలి కొండబాబు ఆధ్వర్యంలో మండలంలోని సంతారి పంచాయతీ బిలాయిపుట్టు గ్రామానికి చెందిన బీజేపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు గొల్లోరి కృష్ణారావు మంగళవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. ఆయనకు పార్టీ కండువా వేసి పార్టీలో చేరారు.

గూడెంకొత్తవీధి: మండలంలోని పీకే గూడెంలో జీకే వీధి పీఏసీఎస్ అధ్యక్షుడు వంతల అరుణ్ ఆధ్వర్యంలో మంగళవారం నాయకులు మేము సిద్ధం..మా బూత్ సిద్ధం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామస్తులకు ప్రభుత్వ పథకాలను వివరించారు. మండల కన్వీనర్ బాబి, శ్రీకాంత్, కన్నబాబు పాల్గొన్నారు.

5న పనవగిరిలో విగ్రహ ప్రతిష్ట

అడ్డతీగల: పవనగిరి క్షేత్రంలో భద్రకాళి సమేత వీరభద్రేశ్వరస్వామి వారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని ఏప్రిల్ 5 న నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు పవనగిరి క్షేత్రం వ్యవస్థాపకులు తణుకు వెంకటరామయ్య తెలిపారు. నూతన ఆలయం నిర్మిస్తున్న నేపథ్యంలో పనులు తుది దశకు చేరుకున్నట్టు చెప్పారు. ఆరోజు వేదమంత్రోచ్చారణల నడుమ విగ్రహాలను ప్రతిష్ఠించనున్నట్టు తెలిపారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. ఆలయ నిర్మాణం దాతల సహాయంతో చేయిస్తున్నామన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

కొయ్యూరు: మండలంలోని పాతపాడి, గన్నెర్లపాలెంలోని అంగన్‌వాడీ కేంద్రాలను సీడీపీవో విజయకుమారి మంగళవారం సందర్శించారు. పోషణ పక్వాడా కార్యక్రమంలో భాగంగా గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆకుకూరల వల్ల కలిగే లాభాలను వివరించారు. తాజా పండ్లను, ఆకుకూరలను విధిగా తీసుకోవాలని కోరారు. అంగన్వాడీ వర్కర్లు ఏర్పాటు చేసిన ఆహర పదార్థాలను పరిశీలించి వాటి ప్రాధాన్యతను వివరించారు. యోగా నిర్వహించి దాని ప్రాముఖ్యతను తెలిపారు.

బీఎస్ఎన్ఎల్ సేవలకు అంతరాయం

సీలేరు: సీలేరులో బిఎస్ఎన్ఎల్ సేవలు గడిచిన కొద్ది నెలలుగా తీవ్ర అంతరాయం కలుగుతుంది.దీంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ఈ ప్రాంతం అంతా బీఎస్ఎన్ఎల్ బ్రాండ్‌బ్యాండ్ మరియు ఫైబర్‌నెట్‌లపై బ్యాంకులు ,పెట్రోల్ బంకులు, సచివాలయం, ఉద్యోగుల కార్యాలయాలు అధారపడి ఉన్నాయి.తరచూ సిగ్నల్ పోవడం వలన అత్యవసర సేవలకు అంతరాయం ఏర్పడుతుంది. రోజుల తరపబడి సిగ్నల్ రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని పలువురు వినియోగదారులు చెబుతున్నారు. రోజుల తరబడి సిగ్నల్ వ్యవస్థ నిలిచిపోవడంతో నానా ఇక్కట్లు తప్పడం లేదంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.